

# గ్రూప్ ఫొటో ★

రచన:
వి. ఆర్. కొరళ్ల

నాబంధుమిత్రులలో చాలమంది 'ఫొటో' లంటే చాల కుతూహలపడుతుంటారు. ఒక్కొక్కరింట్లో వివిధ రకాల పోజులతో తాము తీయించుకున్న ఫొటోలు వేలాడేసుకుంటారు. ఎక్కడైనా గ్రూపు ఫొటోలుంటే విడవకుండా పాల్గొంటారు చాలమంది. బహిరంగసభలలోను, విందులలోను, నాయకులకు కొంచెం వెనుకనో ముందుగనో నుంచుని ఫొటోలు తీసేటప్పుడు తామూ పడేలా వీలైనంత విశ్వప్రయత్నం చేస్తుంటారు. కొంతమంది నాయకులకు దండలు వేసేటప్పుడు, సన్మానపత్రాలు యిచ్చేసమయంలోను, మరి కొంతమంది జండా లెగరేసే సమయంలోను చాటుగా సొంత ఫొటోగ్రాఫరును తెచ్చుకుంటారు పత్రికలకు పంపటానికని.

అందరిమాదిరి నేనూ ఫొటో అంటే పడిచచ్చేవాడిని. కాని రానురాను నాకు ఫొటో తీయించుకోవటమంటే భయంగాను, చిరాకుగాను ఇంకా చెప్పాలంటే పరమ అసహ్యంగాను వుంటుంది. అందుకనే యీ మధ్య ఫొటోలకు వెళ్లటమే మానేశాను. వీటికి చాల కారణాలున్నాయి. అవి వింటే మీకు నవ్వు వస్తుంది కాని నాకు మాత్రం విచారం కలుగుతుంది.

నేను మా పేటలో ఓ సంఘానికి ప్రెసిడెంటును. ఒకసారి మా వీధిలోని ఒక పెద్ద మనిషి పరాయివూరు బదిలీ అవుతున్న సందర్భంలో మా సంఘంతరపున చిన్న టీపార్టీ, ఫొటో యేర్పాటుచేశాము. మామూలుగా 'టీ' అనంతరం ఫొటోకొరకు వెళ్లాము. కొంతమంది ముఖ్యమైనవాళ్లం కుర్చీలమీద, మరి కొంతమంది వెనుక బెంచీలమీద మిగిలిన వారు కింద చాపలమీద కూర్చునేలా ఏర్పాటు చేశారు ఫొటోగ్రాఫరు. ప్రెసిడెంటును కాబట్టి నేను పెద్దమనిషి పక్కన కూర్చున్నాను; ఇంతలో పెద్దమనిషిగారి బావమరదిగారు వచ్చారు. వారికి టీ ఫలహారం యిద్దామనుకదా అని లోపలికివెళ్లి వచ్చేలోపలే ఆయనగారు పెద్దమనిషిపక్కన కుర్చీలో (నా స్థానం) చక్కగా కూర్చున్నారు. నాతావులో ఆయన్ను చూచేసరికి గుండె గుభేలంది. అందులోంచి ఎవరిని లేవమంటే ఎవరికేం కోపమొస్తుందో అని నేను పిలవని పిల్లలమధ్య చాపమీద కూర్చున్నాను విచారంగా, తరువాత నాలుగు రోజులకు మా గ్రూపుఫొటోపత్రికలలో పడింది. అందులో క్రింద చాపమీద కూర్చున్నవారిలో నాల్గవవారు సంఘ ప్రెసిడెంటు అని వ్రాశారు అది చూచిన తరువాత నాకు ఏడవాలో నవ్వాలో తెలియక ఏడవటం ఎందుకులే, ఏడ్చేరోజువస్తే ఎటూ ఏడవక తప్పదని నాలో నేనే నవ్వుకున్నాను. ఆ తరువాత నన్ను చాలమంది మిత్రులడిగారు. 'ఆదేంటయ్యా సంఘ ప్రెసిడెంటువి క్రింద చాపమీద కూర్చున్నావేమని దానికి జవాబేమి చెప్పాలో తెలియక 'పిల్లలమధ్య కూర్చోవటమంటే నాకు చాల సరదా' అని చెప్పి సమర్థించా కడుపులో మండుతున్నా.

మరోసారి ఒక నూతన నాటకసమాజ ప్రారంభోత్సవానికని నన్ను ఆహ్వానించారు. పిలిచారుకదా అని వెళ్లాను. అక్కడ కూడ టీ అనంతరం ఫొటో ఏర్పాటుచేశారు. మునుపటిలాకాక యీ పర్యాయం నా స్థానం మరొకరు ఆక్రమించకుండా కుర్చీని అంటిపెట్టుకునే కూర్చున్నా. ఎవరైనా పిలిస్తే విననట్లే నటించాను. నమస్కారంపెట్టినా కూర్చునే ప్రతి నమస్కారంచేశానే తప్ప నించోనేలేదు నాచోటు పోతుందేమోననే భయంతో. ఫొటో తీసేముందు అధ్యక్షులవారికి నాకు పూలమాలలువేశారు. ఎందుకైనా మంచిదని నేను మాత్రం దండలుతీసేశాను. ఆయనమాత్రం వుంచుకున్నారు. ఫొటో తీస్తుండగా అధ్యక్షులవారు తాను వేసికొన్న తమలపాకులకు నాలుక పండిందో లేదో అని నాలుక ముందుకుచాచుకొని చూస్తుండగా ఫొటోగ్రాఫరు క్లిక్‌కొట్టాడు. (పాపం ఫొటోగ్రాఫరు తప్పేమిలేదు. రెడీ అని చెప్పేడు ముందుగనే) తీరా కాపీలు వచ్చిన తరువాత చూస్తే అధ్యక్షులవారు వెనక్కువాలి నోరు తెరచుకొని చచ్చిన పీనుగమాదిరి వున్నాడు. అందులో ఆయన ముఖానికి పంగనామాలు, మెడలో పూలమాలలూ వున్నాయి కదూ! కొత్తగా చూచినవారు అది చచ్చినప్పుడు కూర్చోబెట్టి తీశారేమోనని భావించేలా వుంది. మరొకాయన కండువా గాలికి పక్కాయన ముఖంమీద వాలింది. ఇట్లా ఫొటో మొత్తం చాల అసహ్యంగా తయారయింది.

అధ్యక్షులవారు తనకి దండలువేసినట్లు అందరికీ తెలియటం కొరకని తన బంధుమిత్రులకు, పత్రికలకు పంపటానికని ఒక యాభై ప్రింట్లు చాటుగా యివ్వమని ఫొటోగ్రాఫరుకు రహస్యంగా చెప్పారట. తీరా ఫొటోలో ఆయనపడ్డ తీరు చూచి ఆయనకే అసహ్యంవేసి అదనపుకాపీలు వద్దని కబురు పంపారట. ఆ కోపంచేత అసలు రహస్యం నాతో చెప్పటమేకాక ఏమనుష్యులండీ ఫొటో తీయించుకోటం చాతకాదు. ఫొటో అనగానే లేనిపోని ఫోజులు తెచ్చిపెట్టుకుంటారు, బిగపీసుకు కూర్చుంటారు బాబా" అని పెదవి విరిచాడు.

నేను వెళ్లినప్పుడల్లా ఏదో ప్రమాదం సంభవిస్తూనేవుంది. అందుకని గ్రూపుఫొటోలకు వెళ్లటమే మానేశాను. వెళ్లాలంటే మహాభయమేకాక కాళ్లుచేతులు వణకుతున్నయ్. అకారణంగానే చివరికి ఇంతవరకు నాభార్యతో కూడ కలసి ఫొటో తీయించుకోలేదు. నా శ్రీమతి యిప్పటికీ ఏమండీ మనిద్దరం కలసి ఫొటో తీయించుకుందామండీ' అని బ్రతిమాలుతుంటుంది. బ్రతిమాలుతుంటే నాకు జాలేస్తుంది కాని తీసేముందు రెడీ అనగానే ఎక్కడ నిక్కపొడుచుకొని కూర్చుని చచ్చిన వానిలా పడుతుందేమో నని భయంచేత ఎప్పటికప్పుడు వాయిదావేస్తున్నాను.

★